క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ నాయకుల ప్రత్యేక పూజలు



ఇబ్రహీంపట్నం: మహాశివరాత్రి పండుగ పురస్కరించుకుని మూడోరోజు ఇబ్రహీంపట్నం ఫెర్రీలోని త్రిపురాంతకేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. పూజా కార్యక్రమంలో నియోజకవర్గం వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి సర్నాల తిరుపతిరావు పార్టీ నాయకులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు సత్కరించి దివ్య ఆశీస్సులు అందజేశారు. ఆలయ ప్రాంగణంలో భక్తులకు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు జోగి రాము, మేడపాటి నాగిరెడ్డి, గొల్లపూడి పాండురంగదేవ్ పాల్గొన్నారు.

డాక్టర్ హనిమిరెడ్డి జీవితం ఆదర్శం



మైలవరం: ప్రవాసాంధ్రులు డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి జీవితం ఎంతో మందికి ఆదర్శప్రాయమని వైఎస్సార్ సీపీ మైలవరం నియోజకవర్గ పరిశీలకులు అప్పిడి సత్యనారాయణరెడ్డి తెలిపారు. మైలవరంలోకి డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి నివాసంలో డాక్టర్ మెండా దేవానంద్‌కుమార్ రచన సారధ్యంలో ప్రచురితమైన హనిమిరెడ్డి జీవిత చరిత్ర పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం జరిగింది. కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ డాక్టర్ హనిమిరెడ్డి తాను ఎదుగుతూ పక్కవారి ఎదుగుదలను ప్రోత్సహించడంలో ముందుంటారన్నారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



తిరువూరు: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఎటువంటి వివాదాలకు దిగినా కఠిన చర్యలు తీసుకుంటామని రౌడీషీటర్లను తిరువూరు సీఐ అబ్దుల్ నబీ హెచ్చరించారు. స్థానిక పోలీసుస్టేషన్లో ఆదివారం రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎన్నికల సమయంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడవద్దని, సత్ప్రవర్తనతో మెలగాలని తెలిపారు. ఎస్ఐ సత్యనారాయణ పాల్గొన్నారు.

రాజకీయాలకు అతీతంగా పథకాలు



చాట్రాయి: అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరేనని ఏపీ కో–ఆపరేటివ్ యూనియన్ రాష్ట్ర చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం మండలంలోని పర్వతాపురం గ్రామంలో నిర్వహించిన గడప గడపకు వైఎస్సార్ సీపీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రతి ఇంట్లో ఎన్ని పథకాలు వచ్చాయి, అర్హత కలిగినా పథకాలు రావడం లేదాని అడిగి తెలుసుకున్నారు. రాబోయే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను గెలిపించుకుని జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేద్దామని పిలుపునిచ్చారు. సర్పంచ్ మిదె శివాజీ, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు మిద్దె బాలకృష్ణ, నాయకులు మిద్దే సత్యనారాయణ పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

ఆగిరిపల్లి: స్థానిక ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు సోమవారం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నిర్వహించే నాలుగో విడత వైఎస్సార్ చేయూత చెక్కు, రిజిస్ట్రేషన్ పట్టాల పంపిణీ చేస్తారు. ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొనాలని ఎంపీడీఓ శామ్యూల్ కోరారు.

నేడు పాస్టర్ల సమావేశం

నూజివీడు: నూజివీడు డివిజన్ పాస్టర్స్ ఫెలోషిప్ జనరల్ బాడీ సమావేశాన్ని సోమవారం పట్టణంలోని హోటల్ రాయల్‌గ్రాండ్‌లో నిర్వహిస్తున్నట్లు డివిజన్ చైర్మన్ కేటీ ప్రభాకర్ రావు ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు, అంతర్జాతీయ ప్రసంగీకులు బండి ఐజాక్, పి.జీవన్‌కుమార్ పాల్గొంటారన్నారు.

నేడు హుండీ కానుకల లెక్కింపు

ముసునూరు: మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా బలివే రామలింగేశ్వరస్వామి ఆలయానికి హుండీల ద్వారా లభించిన కానుకలకు సోమవారం లెక్కించనున్నట్లు ఈఓ సతీష్‌కుమార్, ఆలయ కమిటీ చైర్మన్ నాగేశ్వరరావు తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి దేవదాయ, రెవెన్యూ, పోలీస్ శాఖల అధికారులు, సర్పంచ్ రావు ప్రవీణ సుధాకర్, సమక్షంలో సిబ్బంది లెక్కింపు నిర్వహిస్తారు.

ప్రజాసంక్షేమానికి సీఎం జగన్ నిరంతర కృషి

- విజయవాడ ఎంపీ కేశినేని శ్రీనివాస్ (నాని)
- పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవం



తెల్లదేవరపల్లిలో గ్రామ సచివాలయం భవనాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ కేశినేని నాని, పక్కన స్వామిదాసు

తెల్లదేవరపల్లి (విస్సన్నపేట): ప్రజాసంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రిని చేసుకోవటానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని విజయవాడ ఎంపీ కేశినేని శ్రీనివాస్ (నాని) అన్నారు. ప్రభుత్వం సేవలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకే గ్రామ సచివాలయ వ్యవస్థను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తీసుకు వచ్చారని చెప్పారు. మండలంలోని తెల్లదేవరపల్లి గ్రామంలో రూ.88 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం, హెల్త్‌సెంటర్, రైతుబరోసా కేంద్రాలను ఎంపీ ఆదివారం ప్రారంభించారు. పుట్రేల పంచాయతీ రామానగరంలో నిర్మించిన రైతుబరోసా కేంద్రం, వేమిరెడ్డిపల్లిలో నిర్మించిన సచివాలయ భవనం, సొసైటీ భవనాలను ఎంపీ ప్రారంభించారు. గతంలో ఏ ప్రభుత్వం అమలు చేయని విధంగా అభివృద్ధి సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పాలన కొనసాగిస్తుందన్నారు. ప్రజల శ్రేయస్సు కోసం పార్టీలకతీతంగా అనేక సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి అమలు చేస్తున్నారన్నారు. గ్రామాల్లోనే సచివాలయం ద్వారా ప్రతి 50 కుటుంబాలకు ఒక వలంటీర్‌ను నియమించి సంక్షేమ పథకాలు నేరుగా అందజేయటం జరుగుతోందన్నారు. గ్రామాల్లో మెరుగైన వైద్యసేవలు అందించేందుకు హెల్త్ సెంటర్ ద్వారా వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా వైద్యసేవలు అందిస్తూ, పేద విద్యార్థులకు ఆంగ్లమాధ్యంలో విద్యాభివృద్ధికి అనేక పథకాలు అమలు చేస్తూ ప్రజలవద్దకే పాలన తీసుకువచ్చిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. గతంలో చంద్రబాబునాయుడు 600 హామీలు ఇచ్చాడు వాటిలో ఎన్ని అమలు చేసింది ప్రజలకే తెలుసన్నారు. ఆయన హయాంలో ఒక్క నిరుపేదకు నివేశన స్థలాలు ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. కానీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అర్హులైన పేదలకు నివేశన స్థలాలు పంపిణీ చేశారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు, కేడీసీసీబీ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి, ఎంపీపీ పిల్లి మెర్సీవనజాక్షి, ఏఎంసీ మాజీ చైర్మన్ మద్దిరెడ్డి సూర్యనారాయణ రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు భీమిరెడ్డి లోకేశ్వరరెడ్డి, తెల్లదేవరపల్లి సర్పంచ్ రాయల నాగరాణి, సొసైటీ అధ్యక్షుడు గంటల నాగాచారి, ఎంపీటీసీ చాట్ల మణి, సచివాలయాల మండల కన్వీనర్ అనుమోలు శివబాజీ, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు నెక్కళపు కుటుంబరావు, వ్యవసాయ సలహామండలి జిల్లా చైర్మన్ దామోదరరెడ్డి, కేడీసీసీబీ డైరెక్టర్ భూక్యా రాణి, పుట్రేల సర్పంచ్ కారుమంచి స్వాతి, వేమిరెడ్డిపల్లి సర్పంచ్ పి. విజయకుమారి, సొసైటీ అధ్యక్షుడు రాయల సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యుడు సత్యనారాయణచారి, పార్టీ నాయకులు నెక్కళపు సుబ్బారావు, శివయ్య, సూరా వెంకట్రామయ్య, రాయల వేణు, ఎంపీడీఓ విజయకుమారి, అధికారులు పాల్గొన్నారు.

గోదాములను సద్వినియోగం చేసుకోండి

కేడీసీసీబీ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి



గోదామును ప్రారంభిస్తున్న కేడీసీసీబీ చైర్‌పర్సన్ పద్మావతి, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సుధారాణి

ఏ.కొండూరు: గోదాములను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కేడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి అన్నారు. మండలంలోని కంభంపాడు, పోలిశెట్టిపాడు గ్రామాల్లో రూ.80 లక్షల వ్యయంతో నిర్మించిన గోడౌన్లను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు పండించిన పంటలను నిల్వ చేసుకునేందుకు ఇవి ఎంతో ఉపయోగపడతాయన్నారు. పీఏసీఎస్‌ల ద్వారా అర్హులైన రైతులందరికీ వ్యవసాయ రుణాలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రైతుల కోసం పలు రకాల పథకాలు ప్రవేశపెట్టి వారికి అండగా నిలుస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ నల్లగట్ల సుధారాణి, రాష్ట్ర నాయకులు, పీఏసీఎస్ అధ్యక్షుడు నరెడ్ల వీరారెడ్డి, ఎంపీపీ కాలసాని నాగలక్ష్మి, జెడ్పీటీసీ భూక్య గనియా, ఎంపీటీసీ కోట పుల్లారావు, సీఈఓ కోట కృష్ణ, పీఏసీఎస్ అధ్యక్షులు ఏ. వెంకటరెడ్డి, టి.వెంకటేశ్వరరెడ్డి, సర్పంచుల సంఘం అధ్యక్షులు టి.సురేష్, నాయకులు బ్రహ్మానందరెడ్డి, కే శివ, చిట్టిబాబు, బి.వెంకయ్య, బ్యాంక్ డైరెక్టర్ బి.రాణి, కేడీసీసీ బ్యాంకు మేనేజర్ ఉషాజ్యోతి, సూపర్వైజర్ సుబ్బారావు, పలువురు పాల్గొన్నారు.

నేడు 'చేయూత' సంబరాలు

జి.కొండూరు: స్థానిక శాగం శివరామిరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చేయూత నిధుల విడుదల సంబరాల కార్యక్రమం సోమవారం జరుగుతుందని ఎంపీడీఓ శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జి.కొండూరు మండలంలోని 16 గ్రామ సచివాలయాల పరిధిలో 3,745 మంది లబ్ధిదారులకు వైఎస్సార్ చేయూత పథకం కింద నాల్గవ విడత రూ.7.21కోట్లు లబ్ధిదారుల ఖాతాల్లో జమచేయనున్నట్లు వివరించారు.

నేడు 'జగనన్నకు చెబుతాం'

నూజివీడు: పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఈనెల 11న 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆర్డీఓ వై.భవానీశంకరి ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి కార్యాలయంలో డివిజన్‌లోని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి వాటిని గడువులోగా పరిష్కరిస్తామన్నారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో ప్రజలు అర్జీలను అందజేసి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీఓ కోరారు.

మహిళల ఆర్థిక అభ్యున్నతికి చేయూత

జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ నల్లగట్ల సుధారాణి



నమూనా చెక్కును అందజేస్తున్న జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ నల్లగట్ల సుధారాణి, ఎంపీపీ నాగలక్ష్మి

ఏ.కొండూరు: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేయూత ఆసరా పథకాలు ప్రవేశపెట్టారని జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ నల్లగట్ల సుధారాణి అన్నారు. ఆదివారం ఎంపీడీఓ కార్యాలయంలో వైఎస్సార్ చేయూత నాలుగో విడత చెక్కు పంపిణీ కార్యక్రమంలో మాట్లాడారు. మహిళాభ్యున్నతి కోసం 45 సంవత్సరాల నుంచి 60 సంవత్సరాల లోపు వయస్సు గల నిరుపేద అర్హులైన మహిళలందరికీ ప్రతి సంవత్సరం వైఎస్సార్ చేయూత పథకం ద్వారా రూ.18,750 దళారీ వ్యవస్థ లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాలో జమ చేస్తున్నారన్నారు. నాలుగు విడతల్లో ఒక్కొక్క మహిళకు రూ.75 వేలు ఆర్థిక సహాయం అందజేసినట్లు తెలిపారు. ఎంపీ కేశినేని నాని, నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసుల విజయం కోరుతూ రెండు బటన్లు నొక్కి మరోసారి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేయాలని పిలుపునిచ్చారు. మహిళలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు నరెడ్ల వీరారెడ్డి, ఎంపీపీ కాలసాని నాగలక్ష్మి, జెడ్పీటీసీ భూక్య గనియా, వైస్ ఎంపీపీ గుంటక శివారెడ్డి, యూత్ అధ్యక్షులు కాలసాని చెన్నారావు, సర్పంచుల సంఘం అధ్యక్షుడు టి.సురేష్, పీఏసీఎస్ అధ్యక్షుడు ఏ వెంకటరెడ్డి, నాయకులు బి. వెంకయ్య, కే శివ, శ్రీనివాస్, ఎంపీడీఓ పరమాత్మ, సర్పంచులు, ఎంపీటీసీలు, పీఏసీఎస్ అధ్యక్షులు, గ్రామ పార్టీ అధ్యక్షులు, నాయకులు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

చంద్రబాబును నమ్మితే రాష్ట్రం అధోగతే

ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు



శిలాఫలకం ఆవిష్కరించిన ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు



నూజివీడులో వైఎస్సార్ చేయూత చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు

నూజివీడు: చంద్రబాబును నమ్మితే రాష్ట్రం అధోగతి పాలవుతుందని, ఎన్నికల ముందు బూటకపు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజలను మోసం చేయడం బాబుకు వెన్నతో పెట్టిన విద్యని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. మండలంలోని వెంకటాద్రిపురం, హరిశ్చంద్రతండా, కొత్తూరు తండా, యనమదల, బత్తులవారిగూడెంలలో జల్‌జీవన్ మిషన్ కింద రూ.2.06 కోట్లతో చేపట్టిన రక్షిత మంచినీటి పథకం నిర్మాణ పనులు, పైప్‌లైన్ పనులకు ఆదివారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రతాప్ మాట్లాడుతూ 2014 ఎన్నికల ముందు 650 హామీలు ఇచ్చిన చంద్రబాబు ఆరు హామీలు కూడా అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిన ఘనుడని విమర్శించారు. 2014లో అనుభవజ్ఞుడని ప్రజలు గెలిపించడం వల్ల రాష్ట్రంలో 10 ఏళ్లు వెనక్కు పోయిందని, మళ్లీ ప్రజలు ఆ తప్పు చేయవద్దన్నారు. ప్రజలను మభ్యపెట్టేందుకే మోసపూరిత హామీలను ఇస్తున్నాడన్నారు. తాను చేసిన అభివృద్ధిని, అమలు చేసిన పథకాలను చూసి ఓటేయండని అడిగే దమ్ము, ధైర్యం, సత్తా చంద్రబాబుకు లేదన్నారు. కేవలం పొత్తులతో అధికారాన్ని దక్కించుకోవాలని దింపుడు కళ్లెం ఆశతో చంద్రబాబు ప్రయత్నాలు చేస్తుంటే టీడీపీ పరిస్థితి ఏమిటో అర్థమవుతోందన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలన్నింటినీ అధికారంలోకి వచ్చి ఏడాది లోపే సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలు చేసి చూపించారని ఎమ్మెల్యే అన్నారు. సంక్షేమ పథకాలతో పాటు రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలన్నారు. రాష్ట్రంలో నాలుగు పోర్టులను, 17 మెడికల్ కాలేజీలను ఏర్పాటు చేశామన్నారు. ఎంపీపీ ఆరేపల్లి శిరీష, జెడ్పీ వైస్ చైర్మన్ గుడిమళ్ల కృష్ణంరాజు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు శీలం రాము, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ చిలుకూరి భాస్కరరెడ్డి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు ఆరేపల్లి రాంబాబు, పల్లె రవీంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ చేయూత చెక్కు అందజేత

నూజివీడు: ప్రజల సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి కోసం అహర్నిశలూ పాటుపడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండోసారి ముఖ్యమంత్రి కావడం ఖాయమని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. పట్టణంలోని ఎస్ఆర్ఆర్ హైస్కూల్ ఆవరణలో వైఎస్సార్ చేయూత నాలుగో విడత చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రతాప్ మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పిందే చేస్తాడని, ఇచ్చిన హామీలను నెరవేర్చే ఏకైక నాయకుడని అన్నారు. ఎన్నికలంటే చంద్రబాబుకు భయమని, అందుకే పొత్తుల కోసం పాకులాడుతున్నాడన్నారు. 14 ఏళ్లు రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు చెప్పుకోవడానికి ఒక్క పథకమైనా ఉందా? ఆ పథకాన్ని చూసి ఓట్లేయండి అని ప్రజలను అడిగే దమ్ము ఉందా అని ప్రశ్నించారు. అభివృద్ధే ధ్యేయంగా ముందుకు వెళుతున్నామన్నారు. సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణీదుర్గ, ఎంపీపీ, జెడ్పీ వైస్ చైర్మన్, మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము వెంకటేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ ఆర్.వెంకటరామిరెడ్డి, తహసీల్దార్ ఎ.విశ్వనాథ శాస్త్రి, ఏపీ విద్యామౌలిక వసతుల సంస్థ డైరెక్టర్ కలగర వెంకటేశ్వరరావు, మాజీ వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ, ఏపీఎం దయాల రాజశేఖర్, పలువురు కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఆర్పీలు, బుక్‌కీపర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలతో ప్రతి కుటుంబానికీ లబ్ధి



తిరువూరు ఒకటో వార్డులో ప్రచారం చేస్తున్న స్వామిదాసు

తిరువూరు: ప్రభుత్వం ఇప్పటి వరకు అమలు చేసిన సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబానికీ ప్రయోజనం కలిగిందని వైఎస్సార్‌సీపీ తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు అన్నారు. ఆదివారం తిరువూరు ఒకటో వార్డులో గుడ్‌మార్నింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వార్డులోని పలు నివాసగృహాలకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా కలిగిన లబ్ధిని తెలుసుకున్నారు. త్వరలో జరిగే అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో సంక్షేమ పథకాల లబ్ధిదారులు వైఎస్సార్‌సీపీ అండగా నిలవాలని కోరారు. తిరువూరు పట్టణంలో తాగునీటి సమస్య, డ్రెయినేజీ సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. నగర పంచాయతీ చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి, కౌన్సిలర్లు మోదుగు ప్రసాద్, కొలికపోగు నిర్మల, పరసా శ్రీనివాసరావు, పరసా సత్యనారాయణ, మూడు దుర్గారావు, గుంటూరు మస్తాన్, వైఎస్సార్ సీపీ నాయకులు వెలుగోటి ఆదినారాయణ, అజీజ్, దుర్గారావు, రాజ్‌మహ్మద్, పరసా నెహ్రూజీ తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులకు సముచిత స్థానం

తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు



ఆర్యవైశ్య ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న స్వామిదాసు

తిరువూరు: రాష్ట్రంలో ఏ ప్రభుత్వంలోనూ ఆర్యవైశ్యులకు రాజకీయ ప్రాధాన్యత లేదని, వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మాత్రమే అత్యధిక పదవులు ఇచ్చిందని తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు అన్నారు. స్థానిక రుక్మిణీ కృష్ణ ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఆదివారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. తాను 30 సంవత్సరాలుగా తిరువూరులోనే స్థిరనివాసం ఏర్పరచుకున్నానని, ఎన్నికల్లో ఓడినా, గెలిచినా ప్రజాసేవ చేస్తున్నానన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తనను నమ్మి తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారని, రానున్న ఎన్నికల్లో వైఎస్సార్సీపీకి ఆర్యవైశ్యులు అండగా నిలవాలని కోరారు. అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానన్నారు. జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సుధారాణి, విజయవాడ దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థాన పాలకవర్గ సభ్యుడు దేవిశెట్టి బాలకృష్ణ, జిల్లా, రాష్ట్ర ఆర్యవైశ్య ప్రముఖులు కంచర్ల ముత్యప్రసాద్, విద్యాసాగర్‌రావు, మురళి, తిరువూరు చాంబర్ ఆఫ్ కామర్స్ చైర్మన్ కొత్తూరు గంగాధరరావు, నడిం తిరువూరు పీఏసీఎస్ చైర్మన్ గజ్జల సీతారామారావు, దోసపాటి రవికుమార్, తిరువూరు, గంపలగూడెం, ఏకొండూరు, విస్సన్నపేట మండలాల ఆర్యవైశ్య సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

పోలీసు దళాల కవాతు



కొండపల్లిలో కవాతు నిర్వహిస్తున్న ఏసీపీ, సిబ్బంది



ఈదరలో సాయుధ బలగాల కవాతు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా కొండపల్లిలో పోలీసులు కవాతు ఆదివారం నిర్వహించారు. 120 మంది సివిల్, ఏఆర్, పారామిలటరీ దళాలు స్థానిక బీకాలనీ నుంచి బ్యాంక్ సెంటర్ మీదుగా రైల్వేస్టేషన్ వరకు కవాతు నిర్వహించారు. ఏసీపీ మురళీకృష్ణారావు మాట్లాడుతూ రాజ్యాంగం ద్వారా సంక్రమించిన ఓటుహక్కు వినియోగించుకునేందుకు పోలీసులు ఎల్లప్పుడూ రక్షణ కవచంలా నిలుస్తారని తెలిపారు. అపోహలకు గురికాకుండా ప్రజలు నిర్భయంగా ఓటుహక్కు వినియోగించుకోవాలని కోరారు. కవాతులో సీఐ ఎం.సత్యన్నారాయణ, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆగిరిపల్లి: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో సాగేలా చర్యలు చేపడుతున్నట్లు డీఎస్పీ జి.లక్ష్మయ్య తెలిపారు. ఆదివారం ఈదర, సీతారాంపురం గ్రామంలో కేంద్ర సాయుధ బలగాలు, పోలీస్‌లు కవాతు నిర్వహించారు. అసాంఘిక శక్తులకు సహకరించరాదని ప్రజలను కోరారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తుల సమాచారం అందించాలని డీఎస్పీ లక్ష్మయ్య ప్రజలను కోరారు. నూజివీడు రూరల్ సీఐ రామకృష్ణ, ఎస్ఐ సురేంద్రకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

కొండంత అభిమానం



చాట్రాయి: వైఎస్సార్ సీపీ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై కొండంత అభిమానం ఆ గ్రామస్తులకు. మండలంలోని పర్వతాపురం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ అభిమానులు ఆరుబయట షామియానాలో ఎల్ఈడీ టీవీ ఏర్పాటు చేసుకుని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదివారం మేదరమెట్లలో నిర్వహించిన సిద్ధం సభను తిలకించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. సీఎం జగన్ మాట్లాడినంత సేపు జై జగన్ జైజై జగన్ అంటూ నినాదాలు చేశారు.

నేడు చేయూత చెక్కుల పంపిణీ

రెడ్డిగూడెం: స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణంలో సోమవారం సాయంత్రం 4 గంటలకు వైఎస్సార్ చేయూత చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఎస్.ఆశీర్వాదం తెలిపారు. ఈ కార్యక్రమానికి విజయవాడ ఎంపీ కేశినేని శ్రీనివాస్(నాని), మైలవరం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త సర్నాల తిరుపతిరావు పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొనాలని కోరారు.

బాలికా విద్యకు సావిత్రీబాయి పూలే కృషి



తిరువూరు గ్రంథాలయంలో సావిత్రీబాయి పూలే చిత్రపటం వద్ద నివాళులు

తిరువూరు: దేశ తొలి మహిళా ఉపాధ్యాయిని సావిత్రీ బాయి పూలే వర్ధంతిని తిరువూరు గ్రేడ్–1 శాఖా గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించారు. బాలికా విద్యాభివృద్ధికి సావిత్రీబాయి పూలే చేసిన కృషిని గ్రంథాలయాధికారిణి పద్మావతి వివరించారు. ఆంగ్ల భాషోపాధ్యాయ సంఘ కన్వీనర్ రాంప్రదీప్, పాఠకులు, గ్రంథాలయ సిబ్బంది పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సావిత్రీబాయి పూలేను నేటి బాలికలు స్ఫూర్తిగా తీసుకోవాలని పేర్కొన్నారు.

ఇబ్రహీంపట్నం: బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి, మహిళల విద్యాభివృద్ధికి సావిత్రీబాయి పూలే చేసిన సేవలు మరువలేనివని విద్యుత్ బీసీ ఉద్యోగుల సంఘ రాష్ట్ర కార్యదర్శి ముప్పసాని రామకృష్ణ అన్నారు. ఎన్టీటీపీఎస్ ప్రధాన గేటు వద్ద సావిత్రీబాయి పూలే వర్ధంతి కార్యక్రమం బీసీ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి ఉద్యోగులు పూల మాల వేసి నివాళులర్పించారు. పలువురు ఉద్యోగులు ఆమె ఆశయాలు, సమాజానికి చేసిన సేవలు కొనియాడారు. బ్రాంచి అధ్యక్షుడు ఎంవీ.నారాయణరావు, కార్యదర్శి శ్రీహరి, కోశాధికారి కె.శ్రీనివాసరావు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

విస్సన్నపేట: గొప్ప సంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలే అని ఎంపీపీ పిల్లి మెర్సీవనజాక్షి అన్నారు. బహుజన దళిత ఐక్యవేదిక ఆధ్వర్యంలో సావిత్రీబాయి పూలే వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. స్థానిక పూలే విగ్రహాలకు పూలమాలలె వేసి నివాళులర్పించారు. బాలికా విద్య అభివృద్ధికి ఆమె చేసిన కృషిని కొనియడారు. కార్యక్రమంలో బహుజన దళిత ఐక్యవేదిక సభ్యులు పాల్గొన్నారు.




ఎన్టీటీపీఎస్ వద్ద సావిత్రీబాయిపూలే చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న బీసీ ఉద్యోగులు



పూలే దంపతుల విగ్రహాల వద్ద నివాళులు అర్పిస్తున్న ఎంపీపీ మెర్సీవనజాక్షి, తదితరులు

ప్రేమ పెళ్లి చేసుకున్న యువకుడిపై దాడి



ఆగిరిపల్లి: ప్రేమించి పెళ్లి చేసుకున్న యువకుడిపై శనివారం రాత్రి యువతి తల్లిదండ్రులు దాడి చేశారు. ఎస్ఐ సురేంద్రకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని సీతారాంపురానికి చెందిన కందుల వంశీ, అత్తి చైతన్య శ్రావణి కొద్దిరోజులుగా ప్రేమించుకున్నారు. ఈ విషయం శ్రావణి తల్లిదండ్రులకు ఇష్టం లేకపోవడంతో వాళ్లిద్దరూ ఈనెల 8న ఏలూరులోని ఓ సంస్థ ద్వారా వివాహం చేసుకుని ఆగిరిపల్లి పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు ఇరువురి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. శ్రావణి తన భర్త దగ్గరే ఉంటానని చెప్పడంతో తల్లిదండ్రులు, బంధువులు వెళ్లిపోయారు. ఈ నేపథ్యంలో శనివారం రాత్రి యువతి తండ్రి ప్రభాకర్ బంధువులతో కలిసి వంశీ ఇంటికి వచ్చి శ్రావణిని తన ఇంటికి తీసుకువెళతానని చెప్పగా వంశీ ఒప్పుకోలేదు. దీంతో ప్రభాకర్, అతడి బంధువులు, వంశీపైనా, అతడి తల్లిదండ్రులపైనా దాడి చేసి శ్రావణిని తీసుకువెళ్లిపోయారు. గాయపడిన వారిని పోలీసులు నూజివీడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వంశీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ సురేంద్రకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.